క్లుప్తంగా

గర్భిణులకు బియ్యం పంపిణీ

అలమూరు: చింతలూరులో బుధవారం గర్భిణులకు బియ్యం పంపిణీ జరిగింది. గ్రామానికి చెందిన కర్రి రామారెడ్డి తన సొంత నిధులు రూ.50 వేలతో సమకూర్చిన 25 కేజీల బియ్యం ప్యాకెట్లను రావులపాలెం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కర్రి నాగిరెడ్డి, ఏజీపీ, నియోజకవర్గ బూత్ కమిటీ మేనేజర్ నామాల శ్రీనివాసు, సర్పంచ్ మార్గని కరుణ చేతుల మీదుగా 53 మంది గర్భిణులకు అందజేశారు. రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు, ఎం.యేసు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విధులు బహిష్కరణ

రాజోలు: ఇరవై రూపాయల వెల్ఫేర్ స్టాంప్ డ్యూటీని తక్షణమే రద్దు చేయాలని కోరుతూ రాజోలు బార్ అసోసియేషన్ న్యాయవాదులు బుధవారం విధులు బహిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కోట సుధాకర్, కొక్కెరగడ్డ శేషగిరిరావుల ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. శుక్రవా రం వరకూ విధులు బహిష్కరిస్తామని అన్నారు. అనంతరం నేలపాడులో రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ గంటా రామారావుకు వినతిపత్రం అందజేశారు. న్యాయవాదులు నీతిపూడి సత్యనారాయణ, గంటి రవికుమార్, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి శరన్నవరాత్ర ఉత్సవాలు

మామిడికుదురు: పెదపట్నంలంకలో కొలువు తీరిన కనకదుర్గ ఆలయంలో ఈ నెల 15వ తేదీ నుంచి 23వ తేదీ వరకూ శతచండీ యాగ సహిత శరన్నరాత్ర మహోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. నవరాత్రుళ్ల ప్రతిరోజు హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు తెలిపారు. బ్రహ్మశ్రీ వలివేటి శ్రీరామశర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 23న మహా పూర్ణాహుతి, శమీపూజతో ఉత్సవాలు సంపూర్ణమవుతాయని కమిటీ పేర్కొంది.

రైతులకు వడ్డీ రాయితీ చెల్లింపు

అంబాజీపేట: స్థానిక సొసైటీలో 2020–21 సంవత్సరానికి సంబంధించి రుణాలు పొంది సకాలంలో చెల్లించిన వారికి 3 శాతం వడ్డీ రాయితీని ప్రభుత్వం అందించిందని సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్ చెప్పారు. సొసైటీ పరిధిలో ఉన్న సుమారు 443 మంది రైతులకు గాను 3 శాతం వడ్డీ రాయితీ రూ.11,22,874 విడుదలయ్యిందన్నారు. అంబాజీపేట డీసీసీ బ్యాంకులో రైతుల సేవింగ్స్ ఖాతాలకు వడ్డీ రాయితీని జమ చేశామన్నారు. రుణాలు సక్రమంగా చెల్లించిన వారికి రాయితీ వర్తిస్తుందని తెలిపారు.

ముగిసిన భాగవత సప్తాహాలు

అంబాజీపేట: ఇతిహాసాలు మానవ జీవనానికి నిర్దేశాలని నంబూరుకు చెందిన చంద్రకాళీ ప్రసాద మాతాజీ కాళీ వన ఆశ్రమ శిష్యులు శ్రీనివాస రామనుజదాసు అన్నారు. ఈ నెల 4వ తేదీ నుంచి స్థానిక పెద్ద వీధిలో ఉన్న ఏవీఆర్ గ్రాండ్ ఏసీ కల్యాణ మండపంలో జరిగిన భాగవత సప్తాహాలు బుధవారం రాత్రితో ముగిశాయి. ఈ సందర్భంగా రామనుజదాసు మాట్లాడుతూ మహా భారతం ధర్మ పరిరక్షణ ఏ విధంగా జరుగుతుందో వివరిస్తుందన్నారు. రుక్మిణీ కల్యాణాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామనుజదాసు దంపతులను భాగవత సప్తాహ కార్యక్రమ నిర్వాహకుడు అప్పన రవికుమార్, రేవతి దంపతులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అప్పన ప్రభాకర రావు, వాసు, బాలాజీ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి రోడ్లపై వేడుకలు నిర్వహిస్తే కేసులు నమోదు

రాజోలు: అర్ధరాత్రి సమయాల్లో రోడ్లపై పుట్టినరోజు వేడుకలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని సీఐ గోవిందరాజు బుధవా రం తెలిపారు. తాటిపాక సెంటర్‌లో నాలుగురోడ్ల కూడలిలో మంగళవారం అర్ధరాత్రి పుట్టిన రోజు వేడుకలు నిర్వహిస్తున్న 13 మందిని గుర్తించి వారికి కౌన్సిలింగ్ ఇచ్చి కేసు నమోదు చేశామన్నారు.

పల్లెల్లో అభివృద్ధి బాటలు



గడప గడపకూ నిధులతో మొగలికుదురులో నిర్మించిన సీసీ రోడ్డు

- 75 సచివాలయాలకు 'గడప గడపకూ' నిధులు
- రూ.15 కోట్లతో పనులు

మామిడికుదురు: గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయి. ప్రజల కనీస అవసరాలు తీరుతున్నాయి. ఇటీవల గ్రామాల్లో నిర్వహించిన గడపగడపకూ కార్యక్రమంలో గుర్తించిన సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తోంది. ఆ దిశగా పనులు కూడా జరుగుతున్నాయి. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిధులతో గ్రామాలు సత్వరం అభివృద్ధి చెందుతున్నాయి. ఎంతో కాలంగా అధ్వానంగా ఉన్న పంచాయతీరాజ్ రోడ్లు గడప గడపకూ నిధులతో అభివృద్ధికి నోచుకుంటున్నాయి. సచివాలయానికి రూ.20 లక్షలు నిధులు కేటాయించడంతో గ్రామాలకు ఎంతో మేలు జరుగుతుందని ప్రజా ప్రతినిధులు, ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిధులతో పక్కా సిమెంట్ కాంక్రీట్ రోడ్లు నిర్మిస్తున్నారు. పి.గన్నవరం నియోజకవర్గంలో 75 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఆధ్వర్యంలో పి.గన్నవరం నియోజకవర్గంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఇప్పటికే పూర్తయింది. దీంతో సచివాలయానికి రూ.20 లక్షలు వంతున నియోజకవర్గానికి రూ.15 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో చేపట్టిన పనులు చాలా చోట్ల పూర్తి కాగా కొన్ని చోట్ల చివరి దశలో ఉన్నాయి.

రూ.40 లక్షలు మంజూరు



గడప గడపకూ కార్యక్రమం ద్వారా అప్పనపల్లి గ్రామంలో రెండు సచివాలయాలకు రూ.40 లక్షలు నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులతో తొమ్మిది సీసీ రోడ్లు నిర్మిస్తున్నాం. ఎంతో కాలంగా అధ్వానంగా ఉన్న మొల్లేటివారిపాలెం రోడ్డును రూ.9.50 లక్షలతో ఆధునీకరించాం. గెడ్డంవారికాలనీలో రూ.9 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించాం. మారు మూల ప్రాంతాల్లో ఉన్న రోడ్లను అభివృద్ధి చేస్తున్నాం.

– గెద్దం మంగాలక్ష్మి, సర్పంచ్, అప్పనపల్లి

సీసీ రోడ్లు నిర్మించాం



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎంతో ముందు చూపుతో ప్రవేశ పెట్టారు. ప్రతి ఇంటికి వెళ్లిన సందర్భంలో ప్రజలు తమ ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకు వచ్చారు. వాటిని ఈ నిధులతో పరిష్కరించాం. ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు సహకారంతో మొగలికుదురుకు రూ.20 లక్షలు నిధులు మంజూరు అయ్యాయి. వాటితో గ్రామంలో అయిదు రోడ్లను సిమెంట్ కాంక్రీట్ రోడ్లుగా ఆధునీకరించాం.

– కడి అరుణకుమారి, సర్పంచ్, మొగలికుదురు

పక్కాగా అభివృద్ధి చేశాం



రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు సహకారంతో మామిడికుదురులో రెండు సచివాలయాలకు రూ.40 లక్షలు నిధులు మంజూరయ్యాయి. వాటితో ఎనిమిది సీసీ రోడ్లు నిర్మించాం. పలు గ్రామాలకు లింకు రోడ్డుగా ఉపయోగపడే కొర్లగుంట మెటల్ రోడ్డును సీసీ రోడ్డుగా అభివృద్ధి చేస్తున్నాం. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం బృహత్తరమైనది, దీని ద్వారా మంజూరైన నిధులు గ్రామాల అభివృద్ధికి ఎంతో దోహదం చేస్తున్నాయి.

– గౌస్ మొహిద్దీన్, సర్పంచ్, మామిడికుదురు

అభివృద్ధికి పెద్దపీట : ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

రావులపాలెం: రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధి పెద్దపీత వేస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఊబలంక గ్రామంలో రూ.1.20 కోట్లతో నిర్మించి పూర్తి చేసిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే రూ. 40 లక్షలు రుడా నిధులతో చేపట్టనున్న పార్కు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శ్రీనివాసరావు, ఎంపీపీ కర్రి లక్ష్మివెంకట నాగదేవి, సర్పంచ్ కొక్కిరగెడ్డ లక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు మల్లిడి లావణ్య, శివ, మాజీ ఎంపీటీసీ సభ్యులు మల్లిడి రామిరెడ్డి, కర్రి వీర్రెడ్డి, ఉప సర్పంచ్ కొవ్వూరి దుర్గారెడ్డి, ఎంపీడీవో జి.రాజేంద్రప్రసాద్, సెక్రటరీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువత మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. స్థానిక శ్రీ సంహిత డిగ్రీ కాలేజ్‌లో ఈ నెల 17న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగే మెగా జాబ్ మేళాకు సంబంధించి పోస్టర్‌ను బుధవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా 19 కంపెనీలకు సంబంధించిన సుమారు వెయ్యి ఖాళీలు భర్తీ చేయడానికి జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా అధికారి లోకమాన్ తెలిపారు. నిరుద్యోగ యువత ఈ జాబ్ మేళా వివరాల కోసం 9705815789, 9851456111 నంబర్లను సంప్రదించాలన్నారు.

వైభవంగా లక్ష్మీనృసింహుని కల్యాణం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో బుధవారం ఆర్జిత సేవగా స్వామివారి శాంతి కల్యాణం బహుళ ద్వాదశి తిథి నాడు అర్చకులు ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయంలోని కల్యాణ మంటపంలో ప్రత్యేక వేదికపై ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. అనంతరం అర్చకులు విష్వక్సేన పూజతో స్వామివారి శాంతి కల్యాణం ప్రారంభించారు. వేదమంత్రాలతోను, మంగళవాయిద్యాల నడుమ కనుల పండువగా ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యాన స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, అర్చకులు, వేద పండితులు ఈ కల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న భక్తులకు స్వామి మూలవిరాట్టు దర్శనం దేవస్థానం కల్పించింది. లడ్డు ప్రసాదం ఇచ్చి, అన్నదాన పథకంలో భోజన సౌకర్యం కూడా కల్పించింది. సూపరింటెండెంట్ విజయ సారథి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతికి జగన్ కృషి

- కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి
- బడుగువానిలంకలో గడప గడపకూ మన ప్రభుత్వం



బడుగువానిలంకలో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

అలమూరు: పేద బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతియే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్న పథకాలు ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. బడుగువానిలంకలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, సర్పంచ్ దూలం వెంకటలక్ష్మి, పీఏసీఎస్ అధ్యక్షుడు వీరా రాజు, పార్టీ నేత కర్రి నాగిరెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. పేద ప్రజల అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను రాబోయే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతా మహాలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ మోటుపల్లి వెంకన్న, దూలం సత్తిబాబు, పెంటపాటి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌తోనే సుపరిపాలన సాధ్యం

- ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు
- శివకోడులో గడప గడపకూ మన ప్రభుత్వం



శివకోడులో ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే రాపాక

రాజోలు: రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన సాధ్యమని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. బుధవారం ఎమ్మెల్యే రాపాక శివకోడులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఎమ్మెల్యే రాపాక తనయుడు వెంకట్‌రామ్ కూడా ఇంటింటికీ వెళ్లి రానున్న ఎన్నికల్లో సీఎం జగన్‌ను మళ్లీ సీఎంగా విజయపథంలో నిలపాలని కోరారు. ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ సుపరిపాలన, సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా వైఎస్సార్ సీపీ కృషి చేస్తుందన్నారు. ప్రజల ఆరోగ్యం దృష్టిలో ఉంచుకుని జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అన్ని గ్రామాల్లో నిర్వహిస్తున్నారన్నారు. విద్య, వ్యవసాయం, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తున్నారన్నారు. సర్పంచ్ నక్కా రామారావు, ఏఎంసీ చైర్‌పర్సన్ గుబ్బల రోజారమణి, మాజీ ఏఎంసీ చైర్మన్ గెద్దాడ సత్యనారాయణ, మాజీ ఎంపీపీ పాలపర్తి ధనలక్ష్మి, ఎంపీటీసీ కొపనాతి పుష్పలత, చెల్లింగి చినబాబు, కుంపట్ల చిన్నారి, మట్టా ఏడుకొండలు, తిక్కిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడి మృతికి సంతాపం



అంబాజీపేటలో లక్ష్మీపతి చిత్రం పటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: మండల జెడ్పీటీసీ సభ్యురాలు బూడిద వరలక్ష్మి భర్త రిటైర్డ్ ఉపాధ్యాయుడు, యూటీఎఫ్ నాయకులు బూడిద లక్ష్మీపతి(63) మంగళవారం రాత్రి మృతి చెందారు. గత మూడు వారాలుగా అనారోగ్యంతో బాధపడుతున్న లక్ష్మీపతి హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచినట్టు కుటుంబ సభ్యులు బుధవారం చెప్పారు. లక్ష్మీపతికి భార్య జెడ్పీటీసీ వరలక్ష్మి, ఇరువురు కుమారులు ఉన్నారు. ఆయన మృతితో స్వగ్రామమైన గంగలకుర్రులో విషాదచాయలు అలుముకున్నాయి. పతివియోగంతో బాధపడుతున్న వరలక్ష్మిని వైఎస్సార్ సీపీ నాయకులు కొండేటి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి చినబాబు, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, సర్పంచ్ కాండ్రేగుల శ్రీనివాస్, ఎంపీటీసీ నెల్లి పండు, జెడ్పీటీసీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, సొసైటీ అధ్యక్షులు, వివిధ పార్టీల నాయకులు, స్థానికులు పరామర్శించారు.

పరిషత్ కార్యాలయంలో సంతాప సభ

స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి చినబాబు అధ్యక్షతన బుధవారం లక్ష్మీపతి మృతికి సంతాప సభ నిర్వహించారు. ఈ సభకు ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు హాజరై లక్ష్మీపతి సేవలను కొనియాడారు. అనంతరం ఆయన చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. సంతాప సభలో బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, ఉందుర్తి నాగబాబు, చింతపల్లి వెంకటేశ్వరరావు, కాండ్రేగుల గోపాలకృష్ణ, కోట విజయరాజు తదితరులు పాల్గొన్నారు.



బూడిద లక్ష్మీపతి(ఫైల్)

అన్నదాన భవనం నిర్మాణానికి విరాళం



దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ సిబ్బంది

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి వెంకన్న ఆలయంలో నిర్మిస్తున్న వకుళ మాత అన్నదాన భవన నిర్మాణానికి కరప మండలం వేలంగికి చెందిన ఎం.కృష్ణప్రసాద్, విజయ భారతి దంపతులు రూ.60 వేలు విరాళం అందించినట్టు ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. దాతకు సిబ్బంది చేతుల మీదుగా స్వామి వారి చిత్రపటం అందజేశారు.

యూనిఫాం పంపిణీ

మలికిపురం: ఇంటర్ విద్యార్థులకు రూ.25 వేలు విలువ చేసే యూనిఫాం, బ్యాగ్‌లు, స్టీల్‌వాటర్ బాటిల్స్‌ను బుధవారం బట్టేలంక ఉన్నత పాఠశాలలో పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు నేదునూరి హనుమంతరావు దాత కూనపరాజు చంద్రరాజును అభినందించారు. అలాగే సర్పంచ్ బోనం సీతారత్నం, అర్జునరావు దంపతులు రూ.10 వేలు విలువ చేసే ఎన్ఎంఎంఎస్ పుస్తకాలు పంపిణీ చేశారు. అంతర్జాతీయ పర్యాటక దినోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో జిల్లా ప్రథమస్థానం పొంది ఎనిమిదో తరగతి విద్యార్థి చదలవాడ సంజయ్‌ను అభినందించారు.

97 మందిపై కేసు నమోదు

అంబాజీపేట: విద్యుత్ పరిమిత కంటే అదనపు లోడును వినియోగిస్తున్న 81 మంది, మాల్ ప్రాక్టీస్‌కి పాల్పడిన 16 మందిని గుర్తించి వారిపై కేసు నమోదు చేసినట్లు అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆపరేషన్ ఎం.రవికుమార్ బుధవారం తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అంబాజీపేట, సఖినేటిపల్లి మండలాల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టగా అక్రమంగా విద్యుత్‌ను వినియోగిస్తున్నట్టు గుర్తించామన్నారు. ముగ్గురు మీటర్లు లేకుండా, ఐదుగురు విద్యుత్ మీటర్లు తిరగకుండా విద్యుత్‌ను వినియోగిస్తున్నట్టు గుర్తించి వారిపై శాఖాపరమైన కేసులు నమోదు చేశామన్నారు.

నేడు కీళ్ల వైద్య శిబిరం

అంబాజీపేట: ప్రపంచ కీళ్ల వాత దినోత్సవం సందర్భంగా స్థానిక స్త్రీల ఆసుపత్రిలో గురువారం మెగా కీళ్ల వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు ఆసుపత్రి సీఈఓ డాక్టర్ ఎస్.హెవార్డురాజ్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి ఈ శిబిరం ప్రారంభమవుతుందన్నారు. విశాఖపట్నం కేజీహెచ్‌కి చెందిన డాక్టర్ ఇండ్ల మౌనిక రోగులకు పరీక్షలు నిర్వహించి, మందులు ఇవ్వనున్నట్టు తెలిపారు. రిజిస్ట్రేషన్ ఫీజు కేవలం ఒక రూపాయి మాత్రమేనని, ఎక్స్‌రేలపై 50 శాతం తగ్గింపు ఇస్తామని, ముఖ్యంగా బీపీ షుగర్ పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తామని వివరించారు. రోగుల వద్ద ఉన్న పాత రిపోర్టులను తప్పనిసరిగా తీసుకొని రావాలని హెవార్డు రాజ్ పేర్కొన్నారు. అలాగే దంత పరీక్షలు నిర్వహిస్తారని హెవార్డు రాజ్ వివరించారు.

ఇంగ్లాండ్‌లో ప్రశంసా పత్రం అందుకున్న డాక్టర్ మోహిత్

ఆత్రేయపురం: ర్యాలి గ్రామానికి చెందిన ఇంగ్లాండ్ రిజిస్టర్ ఫిజియోథెరపీ డాక్టర్ మోహిత్ కృష్ణ ఇంగ్లాండ్‌లో ప్రశంసాప్రతం అందుకున్నాడు. ఇంగ్లాండ్‌లోని ఎన్‌హెచ్‌ఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రముఖ సాల్ట్ ఫ్రెండ్ రాయల్ ఎన్‌హెచ్‌ఎస్ అధునాతన హాస్పటల్‌లో చేసిన ఉత్తమ వైద్య సేవలకు ప్రశంసా పత్రాన్ని స్థానిక హాస్పటల్‌లో అందుకున్నట్టు ఆన్‌లైన్‌లో విలేకరులకు మోహిత్ తెలిపాడు. ఈ సందర్భంగా మోహిత్ విలేకర్లతో మాట్లాడుతూ ఇంగ్లాండ్, ఇండియాలో ఫిజియోథెరపీ సేవలను అందించడానికి ఇంగ్లాండ్ హెచ్‌సీపీసీ, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజియోథెరపీల నుంచి సభ్యత్వం పొందడం ఒక తెలుగువాడిగా గర్వంగా ఉందన్నారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి
- ఊబలంకలో జగనన్న ఆరోగ్య సురక్ష



పొదలాడలో దివ్యాంగురాలిని శిబిరానికి తీసుకుని వస్తున్న వలంటీరు



గుడిమూలలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ప్రారంభోత్సవంలో పాల్గొన్న జెడ్పీటీసీ, ఎంపీపీ



రావులపాలెం మండలం ఊబలంకలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పని చేస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఊబలంక సచివాలయం–1 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. స్థానిక ఎస్ఎస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం శాఖల వారీగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించి వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం రోగులకు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యసేవలు అందిస్తున్న వైద్యులు జి.దుర్గాప్రసాద్, అన్నపూర్ణ, గంగిరెడ్డి, షేక్ హసీనా, శ్రీకాంత్, షాయిలేఖ, నజీమాన్‌లను సత్కరించారు, కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శ్రీనివాసరావు, ఎంపీపీ కర్రి లక్ష్మివెంకట నాగదేవి, సర్పంచ్ కొక్కిరగెడ్డ లక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు మల్లిడి లావణ్య, శివ, మాజీ ఎంపీటీసీ సభ్యులు మల్లిడి రామిరెడ్డి, కర్రి వీర్రెడ్డి, ఉప సర్పంచ్ కొవ్వూరి దుర్గారెడ్డి, ఎంపీడీవో జి.రాజేంద్రప్రసాద్, సెక్రటరీ బూసి ప్రసాద్ పాల్గొన్నారు.

పొదలాడలో...

రాజోలు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ద్వారా ఎంతో మందికి గ్రామంలోనే మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని ఏఎంసీ చైర్‌పర్సన్ గుబ్బల రోజారమణి అన్నారు. బుధవారం పొదలాడ పంచాయతీ వద్ద సర్పంచ్ కడలి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. గ్రామానికి చెందిన 500 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మండల వైస్ చైర్మన్ పొలమూరి శ్యాంబాబు, ఎంపీటీసీ శిరిగినీడి వెంకటేశ్వరరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణమూర్తి, వైఎస్సార్ సీపీ నాయకులు కంబాల చంద్రరావు, లిఖితపూడి బుజ్జి, మాజీ ఎంపీటీసీ గెద్దం సురేష్, మట్టా ఏడుకొండలు, బందారు కాశీ, కొప్పాడి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

మొసలపల్లిలో...

అంబాజీపేట: మొసలపల్లిలో సర్పంచ్ దంతులూరి రమాదేవి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ పి.నాగపద్మలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరానికి ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు హాజరై మాట్లాడారు. వైద్యులు 320 మందికి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నూకపెయ్యి సత్యనారాయణ, దంతులూరి శ్రీనురాజు, కట్టా రామచంద్రరావు, కట్టా గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గెద్దాడలో..

మామిడికుదురు: గెద్దాడ గ్రామ పంచాయతీ వద్ద బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ గుబ్బల గీతాభవాని, ఎంపీటీసీ సభ్యురాలు జవ్వాది పద్మావతి ప్రారంభించి, ప్రజలకు మందులు అందజేశారు. అక్కడ అంగన్‌వాడీ టీచర్స్ ఏర్పాటు చేసిన స్టాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, ఈఓ పీఆర్డీ ఆచంట శ్రీనివాస్, కార్యదర్శి పీవీఎస్‌వీ ప్రసాద్, కుసుమ శ్రీధర్, స్థానికులు పాల్గొన్నారు.

అలమూరు: అలమూరు గ్రామ సచివాయం–2 పరిధిలో ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ ఆధ్వర్యంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ నేలపూడి లావణ్య పర్యవేక్షించారు. శిబిరంలో 423 మందికి పరీక్షలు చేశారు. అంగన్‌వాడీలు ఏర్పాటు చేసిన 36 రకాల పౌష్టికాహార వంటకాలు, పండ్ల ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. గ్రామ పంచాయతీ ఈఓ కె.సంజీవరెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా, సూపర్వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.ఉమ, ఫార్మాసిస్టు సుగుణ లక్ష్మి పాల్గొన్నారు.

గుడిమూలలో...

సఖినేటిపల్లి: గుడిమూల ప్రాథమిక పాఠశాలలో ఎంపీడీవో జి.భీమారావు ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సర్పంచ్ దెందుకూరి శ్రీహరిరాజు అధ్యక్షతన ఏర్పాటైన ఈ శిబిరాన్ని జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, ఎంపీపీ వీరా మల్లిబాబు ప్రారంభించారు. రోగులకు వైద్య సిబ్బంది అందజేస్తున్న సేవలను వారు పరిశీలించారు. 300 మందికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. వైద్యాధికారి డాక్టర్ యునుస్, వైస్ ఎంపీపీ రుద్రరాజు చినరాజా, డిప్యూటీ తహసీల్దారు సీహెచ్ భాస్కర్, రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ వీ రామరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

సురక్షతో ప్రజలకు మేలు



బెల్లంపూడిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

పి.గన్నవరం: రాష్ట్ర ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. బెల్లంపూడి గ్రామంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సర్పంచ్ బండి మహాలక్ష్మి ప్రారంభించారు. శిబిరాన్ని సందర్శించిన చిట్టిబాబు మాట్లాడారు. వైద్యాధికారి కె.సుబ్బరాజు, వైద్య నిపుణులు మణిదీపిక, సిద్ధార్థనాయుడు, రియాజ్ ఉన్నీషా బేగం తదితరులు 288 మందికి వైద్య సేవలు అందించారు. ఎంపీడీఓ ఎం.భారతి, మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర రావు, సర్పంచ్‌తోలేటి బంగారునాయుడు, మహాలక్ష్మి ఫౌండేషన్ సభ్యుడు బండి రమేష్, బండి రాంబాబు, చింతా నాగేశ్వరరావు, మెల్లం వెంకటేశ్వర రావు, సురేష్, పంచాయతీ కార్యదర్శి వైఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గర్భంలోనే మృతి చెందిన పుంగనూరు దూడలు



చనిపోయిన పుంగనూరు దూడలు

కొత్తపేట: స్థానికంగా ఒక ఒంగోలు ఆవుకు పుంగనూరు కవల దూడలు పుట్టాయి కానీ అవి గర్భంలోనే చనిపోయాయి. కొత్తపేటకు చెందిన సుగంధం ప్రసాద్ అనే వ్యక్తి తొలిచూరి ఒంగోలు జాతి ఆవును కొని పెంచుతున్నారు. గతంలో రెండు ఈతలు ఈనగా మూడోసారి పుంగనూరు దూడలపై ఆసక్తితో సుమారు 8 నెలల క్రితం మండల పరిధిలోని అవిడి గ్రామంలో పుంగనూరు జాతి గిత్తతో ఆవుకు క్రాసింగ్ చేయించారు. కాగా బుధవారం ఉదయం ఆవుకు నొప్పులు రావడంతో యజమాని ప్రసాద్ స్థానిక వెటర్నరీ ఆస్పత్రి వైద్యులను సంప్రదించారు. వారు ఆవును పరిశీలించి పుంగనూరు దూడను బయటకుతీశారు. అది లోపలే చనిపోయింది. తర్వాత కాసేపటికి మరో దూడ ఉందని గుర్తించి దానిని కూడా బయటకు తీయగా అది కూడా మృతి చెంది ఉంది. దీంతో యజమాని ప్రసాద్ నిరుత్సాహానికి గురయ్యారు. గర్భంలోనే దూడలు చనిపోవడంపై స్థానిక వెటర్నరీ ఏడీ సీహెచ్‌వీ నారాయణను సాక్షి వివరణ కోరగా 9 నెలలు నిండలేదని, వాతం వల్ల లేదా మరే ఇతర అనారోగ్య కారణాల వల్ల దూడలు చనిపోయాయని తెలిపారు. చనిపోయిన దూడలను గుర్తించి బయటకు తీసేయడం వలన ఆవుకు ప్రమాదం తప్పిందన్నారు. పశువుల ఆరోగ్య పరిస్థితిని తరచూ గమనిస్తూ ఏ విధమైన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాయో గ్రహించి వెంటనే పశువైద్యులను సంప్రదించాలని నారాయణ తెలిపారు.

పారిశుధ్య పనుల పరిశీలన

అలమూరు: డ్రైనేజీల్లో చెత్త చెదారం నింపకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని చొప్పెల్ల సర్పంచ్ దంగేటి చంద్రకళ, ఈఓ పి.శ్యామ్‌సుందర్ కోరారు. గ్రామంలోని పలు వీధుల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను బుధవారం వారు పరిశీలించారు. స్వచ్ఛ భారత్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఇంటి పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రతను పాటించాలన్నారు.